రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని నాగూరులో విద్యుత్తు సబ్ స్టేషన్ మెయింటినెన్స్ పనులు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బొంతాడ శంక్రరావు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. నాగూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నాగూరు, రావివలస, లఖనాపురం, చిలకాం తదితర గ్రామాలకు విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనులు కారణంగా ఉదయం ఏడు గంటల నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. కావున వినియోగదారులు ఈ విషయమును గమనించి తమకు సహకరించాలని వినియోగదారులను కోరారు.

గిరిపుత్రులు పరిహారానికి నోచుకోరా?

ప్రజాశక్తి -సాలూరు

జిల్లాలో వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. తాము నివశించే మారుమూల గిరిజన గ్రామాలకు దూరంగా ఉన్న సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఇప్పుడు గర్భశోకం మిగిలింది. చేతికంది వచ్చిన కూతురు లేదా కొడుకు హాస్టల్‌లో ఉంటూ అనారోగ్యంతో మృత్యువాత పడుతుంటే తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతమైంది. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల మరణాలు గత ఏడాదిలో పెరిగాయి. ప్రధానంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎక్కువ గా విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయి. ఇంతవరకు జిల్లాలో 16మంది వరకు గిరిజన విద్యార్థులు మత్యువాత పడినట్లు తెలుస్తోంది. ఈ మరణాలకు మూలకారణం కనుక్కుని ఆదిశగా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం సంబంధిత పాఠశాలల డిప్యూటీ వార్డెన్ల సస్పెన్షన్‌తో చేతులు దులుపుకుంటోంది.

మారుమూల గిరిశిఖర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్నారు. వీరిలో రక్తహీనత కారణంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం పోషకాహారం అందిస్తున్నా హాస్టళ్లలో తరచూ రక్తపరీక్షలు నిర్వహించకపోవడం, వాటి నిర్వహణకు తగిన ఆరోగ్య సిబ్బంది నియమించకపోవడంతో విద్యార్థులు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురవుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకునే ప్రయత్నం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2022లో మార్చిలో కురుపాం లో మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలలో ఎం.రంజిత్‌కుమార్ అనే విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. అప్పుడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పుష్ప శ్రీవాణి అప్పటి ఐటిడిఎ పిఒ కూర్మనాథ్ ద్వారా రూ.5లక్షల పరిహారం ఆ విద్యార్థి కుటుంబానికి ఇప్పించారు. అప్పటికి ఉమ్మడి జిల్లా గా ఉన్న ఐటిడిఎ లో నిధులు పుష్కలంగా ఉన్న కారణంగా మంత్రి పుష్ప శ్రీవాణి ఒత్తిడి చేసి పరిహారం ఇప్పించారు.

గిరిజన విద్యార్థుల కుటుంబాలనూ ఆదుకోవాలి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో చదువుతూ మృత్యువాత పడిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని పలు గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఐటిడిఎ ద్వారా గాని, ప్రభుత్వం ద్వారా గాని బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలనే డిమాండ్ తీవ్ర మవుతోంది. గత పదేళ్లుగా జిల్లాతో పాటు రాష్ట్రంలోని గిరిజనులంతా వైసిపికి అండగా నిలుస్తున్నారు. ఈ జిల్లాలోనూ మూడు గిరిజన నియోజకవర్గాల్లో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎక్కువగా విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో ఎన్నికలు ఎదుర్కొనున్న నేపథ్యంలో గర్భశోకంలో వున్న గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుత డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకునే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. జిల్లా ఆవిర్భవించిన తర్వాత పార్వతీపురం ఐటిడిఎ ఉట్టి పోయింది. నిధుల్లేని గిరిజన ఏజెన్సీగా మిగిలిపోయింది. జిల్లాగా ఏర్పడిన తర్వాత అప్పటి ఐటిడిఎ పిఒ కూర్మనాథ్ ఉన్న నిధులను కొత్త జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు. ఐటిడిఎ కనీస అవసరాలు తీర్చడానికి కూడా నిధుల్లేకుండా ఆయన స్వామిభక్తితో ధారాదత్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకునే స్థితిలో ఐటిడిఎ లేకపోయి వుండొచ్చు. కానీ ప్రభుత్వం నుంచైనా నిధులు రాబట్టి విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

ఎస్టీ కమిషన్ కి వినతులు

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు శుక్రవారం పాచిపెంట మండలం సరాయివలస, మక్కువ మండలం వైఎస్ వలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థుల మరణాలకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలు గిరిజన సంఘాలు, సిపిఎం నాయకులు కలిసి వినతులు అందజేశాయి. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు, సీదరపు అప్పారావు, ఎం.శ్రీనివాసరావు కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై సమగ్ర, దర్యాప్తు జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో మాదిరిగానే ఆశ్రమ పాఠశాలల్లోనూ ఎఎన్‌ఎంలను నియమించాలని కోరారు. మృతుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కోరారు. విద్యార్థుల మృతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు కోరారు. గిరిజన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని, రూ.5లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన ఆశ్రమపాఠశాలలో ఇటీవల మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని గిరిజన జెఎసి ఎస్టీ కమిషన్ చైర్మన్ శంక్రరావుకు వినతి అందజేశారు. కేంద్రీయ నవోదయ విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన విధంగా ఆశ్రమం పాఠశాల విద్యార్థులకు కూడా వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని వినతిలో పేర్కొన్నారు.

విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి
ఎస్‌టి కమిషన్‌ను కోరిన గిరిజన సంఘాలు



ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతిని అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

విద్యార్థుల మరణాలకు ఉపాధ్యాయులు బాధ్యులా? : యుటిఎఫ్

పార్వతీపురం : ఇటీవల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల మరణాలకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం అన్యాయమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్ రావు అన్నారు. మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజన ఆశ్రమ హైస్కూలులో చదువుతున్న గిరిజన విద్యార్థి అశోక్ ఈనెల 16న చనిపోయాడని, ఈ విద్యార్థి చనిపోవడానికి డెప్యూటీ వార్డెన్ బాధ్యతా రాహిత్యమే కారణమని (చంద్రరావు) సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ఈ విద్యార్థి మరణానికి "కార్డియాక్ అరెస్ట్", ఎడిమా, రక్త హీనత కారణమని రిపోర్డులు తెలియజేస్తున్నాయన్నారు. కావున ప్రభుత్వమే ఈ మరణానికి బాధ్యత వహించాలన్నారు. కావున అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలని, డాక్టర్లచే తరచూ చెకప్ చేయించాలని, సరైన పోషకాహారాన్ని అందించాలని, మెస్ బిల్లులు పెంచాలని యుటిఎఫ్ అనేక ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నామన్నారు. కానీ ప్రభుత్వం ఇవేమీ చేయకపోవడమే విద్యార్థుల మరణాలకు కారణమని అన్నారు. రెండు రోజుల్లో, డెప్యుటీ వార్డెన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేకుంటే ఐటిడిఎ వద్ద ఆందోళన చేస్తామని, ఇకపై ఉపాధ్యాయులెవరూ డిప్యూటీ వార్డెన్లుగా పని చేయరని హెచ్చరించారు.

విద్యార్థుల మరణాలపై సమగ్ర అధ్యయనం

- వైద్య కళాశాల నిపుణులతో పరిశీలన
- సిబ్బందిని బాధ్యులను చేయడం సరికాదు
- ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు

అనారోగ్యానికి గురైన బాలికతో మాట్లాడుతున్న శంకరరావు

ప్రజాశక్తి - మక్కువ/పాచిపెంట

జిల్లాలో వరుసగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మృతిపై సమగ్ర అధ్యయనం చేపట్టనున్నట్లు ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు తెలిపారు. మక్కువ మండలం ఎర్ర సామంతవలస, పాచిపెంట మండలం సరాయివలస గిరిజన ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల మతికి గల కారణాలను ఆరా తీశారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం, వసతి సౌకర్యాలు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి అందుతున్న ఆహారం, వసతి సౌకర్యాలు, విద్యా బోధన తదితర అంశాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్య సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్న నేపథ్యంలో వాటిపై పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. అందుకోసం వైద్య కళాశాలలో పనిచేసే నిపుణులను అజ్ఞానం చేసేందుకు పంపుతామన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఉన్న పరిస్థితులను, మౌలిక సదుపాయాలను నిపుణుల బృందం అధ్యయనం చేస్తుందని తెలిపారు. గురుకులాల్లో విద్యార్థుల మరణాలు సంభవించకుండా ఉండేలా ప్రభుత్వం ప్రతిష్ట చర్యలు చేపట్టనుందని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం గిరిజన గురుకుల పాఠశాలలో తలెత్తే సమస్యల మూలాలను అన్వేషించి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం భరోసా ఇస్తున్నారు. ఎన్నో ఆశలతో గిరిజనులు తమ పిల్లలను చదివి చదివించుకోవాలనే ఉద్దేశంతో పాఠశాలలు పంపిస్తున్నారని అలాంటి వారి ఆశలను ప్రభుత్వం సజీవంగా ఉంచుతూ వారికి అండగా నిలబడుతుందన్నారు.

సిబ్బందిని బాధ్యతలను చేయడం తగదు

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై అధికారులు లోతుగా కారణాలను అన్వేషించాలన్నారు. ఈ మరణాలపై ఎవర్నో ఒకర్ని బాధ్యులను చేయడం సబబు కాదన్నారు. ముఖ్యంగా ఎక్కువమంది విద్యార్థినీ, విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు కనిపిస్తున్నారని, దీంతో అనారోగ్యానికి గురై వ్యాధి నిరోధక శక్తి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరిలో రక్తహీనతకు గల కారణాలు తెలుసుకొని నివారించే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఆశ్రమ పాఠశాలల్లోని సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అలాగే జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణ తరచూ పెరగాలని సూచించారు. ఆయన వెంట ఎటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు, ఎస్ఐ పి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిఆర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ అధికారులు

వేధింపులు ఆపాలని
పిఆర్ ఇంజినీరింగ్ అధికారుల నిరసన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులపై వేధింపులు ఆపాలని జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ సంఘం నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పిఆర్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు లక్ష్మణరావు మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. గతంలో జరిగిన ఉపాధి హామీ ఎస్‌డిఎఫ్ ఇతర గ్రాండ్లతో జరిగిన పనులపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ కేసులను ఎత్తివేస్తామని ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అప్పటి పంచాయతీరాజ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట ఇచ్చినప్పటికీ ఎంతవరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీర్ల వాహనాల అద్దె, మూడు శాతం అడ్మినిస్ట్రేషన్ చార్జీలు, ఔట్సోర్ సిబ్బందికి జీతాలు గత ఏడాది నుంచి లేక ఆర్థిక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నామని అన్నారు. డిపార్ట్మెంట్‌లోని అన్ని సెక్షన్ ఆఫీసర్ ఖాళీలు, ఎఇ, ఎఇఇ, జెటిఒలో నియామకం జరపకపోవడంతో అధికారులకు పని భారం పెరిగిపోతుందన్నారు. ఉపాధి హామీ పనులతో పాటు ప్రాధాన్యతా భవనాల పనుల బిల్లులు తక్షణమే చెల్లించాలని, కొత్త జిల్లాలకు కొత్త నియామకాలు జరపాలని, పిఆర్ సిబ్బంది, అధికారులపై దురుసు ప్రవర్తన వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈనెల 27 లోగా పై సమస్యలు పరిష్కరించకపోతే 28న మహా ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కురుపాం టికెట్ ఎవరికో?

ఆశావహుల్లో ఉత్కంఠ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ కురుపాం నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ఆశిస్తున్న ఆశావాహుల్లో ఉత్కంఠ పెరుగుతుంది. ఇప్పటి వరకు తాము చేసిన పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు అధిష్టానం గుర్తించి నాకంటే నాకు టిక్కెట్ వస్తుందని ఆశావాహులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరి కొంతమంది ఆశావాహులు పార్టీ పెద్దలను కలుస్తూ బయోడేటా, తమ కుటుంబ నేపథ్యం, ఓటు బ్యాంకు తదితర విషయాలను నివేదిస్తూ చాప చాపకింద నీరులా టిక్కెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈసారి నిజమైన గిరిజనులకు టిక్కెట్ కేటాయించాలనే ఆలోచనలో అధిష్టానం ఉందనే సమాచారంతో ఆశావాహులు గట్టి నమ్మకంతో ఉన్నారు. అయితే టిడిపిలో గ్రూపులు పోరు కొనసాగుతూనే ఉంది. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి గ్రూపు టిడిపి కోసం పనిచేస్తే, రెండో గ్రూపు ఆశావాహులు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ దత్తి లక్ష్మణ టిడిపి అభివృద్ధి కోసం పనిచేస్తూ టికెట్ ఆశిస్తున్నారు. పార్టీ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పజెప్పిన నాటి నుంచి 27 నెలలుగా జగదీశ్వరి పార్టీ అభివృద్ధికి ఎనలేని కషి చేశారు. టిడిపికి పెద్ద దిక్కుగా ఉన్న విజయరామరాజు ఆశీస్సులు, కిషోర్ చంద్రదేవ్ సహకారంతో ప్రతి గ్రామానికి వెళ్లి టిడిపికి పూర్వ వైభవం తీసుకొచ్చారు. జగదీశ్వరీకి ఇన్చార్జి పదవి ఇవ్వడం ఇష్టం లేని, రాజుల పాలన అవసరం లేదని కొంతమంది గిరిజన ఆశావాహులు రెండో గ్రూపుగా విడిపోయి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ దత్తి లక్ష్మణరావు సహకారంతో పార్టీ కార్యక్రమాలను పోటాపోటీగా నిర్వహించి టిడిపిలో తమ సత్తా ఏమిటో చూపించారు. అయితే పోటా పోటీగా కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో అధిష్టానం ఆదేశాలను ధిక్కరించి తమ వర్గానికి వ్యతిరేకంగా దత్తి లక్ష్మణరావు గ్రూపు సభ్యులు చేస్తున్న కార్యక్రమాలపై అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో అధిష్టానం స్పందించి కొన్నాళ్లపాటు కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, లేదంటే ఇన్‌ఛార్జితో కలిసి పని చేయాలని సూచించింది. దీంతో రెండో గ్రూపులు ఆశావాహులు సైలెంట్‌గా ఉన్నారు. అయితే ఇదే తరుణంలో కురుపాం కోటకు చెందిన మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌దేవ్ కుమారుడు వైరిచర్ల వీరేశ్‌దేవ్ టిడిపి తెరపైకి వచ్చారు. దీంతో ఆశావాహుల ఆశలపై నీళ్ల చల్లినట్లు అయింది. మరోవైపు దత్తి లక్ష్మణరావుకు పెందుర్తి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడంతో రెండో గ్రూపు ఆశావాహులు బహిర్గతంగా కార్యక్రమాలకు దూరంగా ఉన్నా అంతర్గతంగా టిక్కెట్ కోసం పావులు కదుపుతున్నారు.

ఇది ఇలా ఉండగా కురుపాం టికెట్ ఎవరికి కేటాయిస్తారనేది చర్చ జరుగుతుంది. టిడిపి జనసేన పొత్తు ఖరారైనప్పటికీ మరోవైపు టిడిపి, బిజెపితో కలిసి పోటీ చేస్తుందని ప్రచారం నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు కూడా కురుపాం టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. కురుపాం టికెట్ టిడిపికా, జనసేనకా, లేదా బిజెపికా అనే చర్చ నడుస్తుంది. కురుపాంలో టిడిపికి బలం ఉన్నా గ్రూపు రాజకీయాల కారణంగా విమర్శల పర్వంతో అది కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏది ఏమైనా గ్రూపులను వీడి కలిసికట్టుగా పని చేస్తేనే టికెట్ ఎవరికీ ఇచ్చినా విజయం ఖాయమవుతుందని, లేదంటే ముచ్చటగా మూడోసారి కూడా వైసిపి గెలుపు సునాయాసనం అవుతుందనే చర్చ వినిపిస్తోంది.

ఒకవైపు చర్చలు... మరోవైపు నిర్బంధాలా?

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

చలో విజయవాడకు వెళ్లొద్దని పోలీసుల నోటీసులు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరుపుతూనే మరోవైపు ఈనెల 27న జరిగే ఎపిజెఎసి చలో విజయవాడ కార్యక్రమానికి హాజరు కావద్దంటూ పోలీసులతో నోటీసులు పంపించడం, ప్రభుత్వ నిరంకుశ చర్యలకు నిదర్శనమని ఎపిజెఎసి జిల్లా కో- చైర్మన్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు అన్నారు. మండలంలోని బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆయనకు రూరల్ పోలీసులు శుక్రవారం ముందస్తు నోటీసులు ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నిరంకుశ చర్యల వల్ల చలో విజయవాడను భగ్నం చేయగలరేమోగాని రాష్ట్రంలో వేలాదిగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు పింఛనుదారుల మనసులు గెలవలేరని, ఇందుకు తగిన మూల్యం ఈ ప్రభుత్వం రాబోయే రోజుల్లో తప్పక చెల్లించుకుంటుందని అన్నారు.

మురళీమోహనరావుకు వినతిని అందజేస్తున్న కానిస్టేబుల్

పిఆర్‌టియు నాయకులు ధర్మారావుకు నోటీసులు

బలిజిపేట : ఈనెల 27న ఎపిజెఎసి ఆధ్వర్యంలో జరగబోయే చలో విజయవాడకు ప్రభుత్వ అనుమతి లేదని, మీరు వెళ్లకూడదంటూ బలిజిపేట పోలీస్ స్టేషన్ పోలీసులు పిఆర్‌టియు మండల అధ్యక్షులు వి.ధర్మారావుకు శుక్రవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌టియు పక్షాన ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి చర్యలను ప్రభుత్వం మానుకోవాలని, లేకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు.

చిన్న శ్రీను వద్దకు పాలకొండ పంచాయితీ

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో గత కొద్దిరోజులుగా వైసిపిలో ఉన్న విభేదాలు తారాస్థాయికి వెళ్లడంతో నగరపంచాయతీ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, ఉత్తరాంధ్ర వైసిపి డిప్యూటీ కో-ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) సమక్షంలో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. కౌన్సిలర్లు, ముఖ్యనేతలతో విడివిడిగా మాట్లాడి స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తుంది. ఒక వర్గాన్ని స్థానిక ఎమ్మెల్యే వెనుకేసుకొస్తున్నట్లు కొంతమంది కౌన్సిలర్లు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఎమ్మెల్యే కళావతి, విప్ విక్రాంత్‌తో కూడా పార్టీలోని విబేధాలు కోసం మజ్జి శ్రీనివాసరావు కూలంకుషంగా చర్చించినట్టు తెలిసింది.

సమావేశానికి ఒక గ్రూపు డుమ్మా

నగరపంచాయితీ కౌన్సిలర్లతో మజ్జి శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఒక గ్రూపునకు చెందిన కౌన్సిలర్లు, నాయకులు డుమ్మా కొట్టినట్లు తెలిసింది. కొద్ది రోజులుగా పార్టీ కార్యక్రమలతో పాటు, ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా వీరు డుమ్మా కొడుతున్నారు. తాజాగా పార్టీకి అత్యంత కీలకమైన ఈ సమావేశంలో కూడా వీరు గైర్హాజరవ్వడం పట్ల పార్టీలో చర్చ జరుగుతుంది. ఎమ్మెల్యే గ్రూపుగా పేరు ఉన్న ఆ వర్గం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు డుమ్మా కొట్టడం వెనుక వీరి ఆంతర్యం ఏమిటో ఎవరికీ అంతుపట్టని విషయం. అయితే పట్టణంలో గ్రూపుల పోరు వల్ల పార్టీ కూడా చెడ్డ పేరు వస్తుందని స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు.

శుభకరణ్‌సింగ్ మృతికి కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి - పాలకొండ

సమస్యలపై ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు పాశవికంగా జరిపిన దాడిలో రైతు శుభకరణ్ సింగ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అభ్యుదయ రైతు సంఘం నాయకులు ఖండా ప్రసాద్ రావు డిమాండ్ చేశారు. రైతు ఉద్యమం పట్ల ప్రధాని మోడీ వైఖరి మారకపోతే గుణపాఠం తప్పదని, తక్షణమే రైతుల్ని చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పాలకొండలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమనాథ్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ప్రధాన డిమాండ్లతో శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న రైతులపై హర్యానా పోలీసులు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దాడికి పాల్పడ్డారని అన్నారు. ఈ దాడిలో 21 ఏళ్ల యువరైతు శుభకరణ్ సింగ్ తీవ్ర గాయాలై మరణించారన్నారు. రైతు అనుకూల ప్రభుత్వమని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరిన రైతుల ఉసురుతీస్తుందని విమర్శించారు. అలాగే మృతి చెందిన రైతు శుభకరణ్ సింగ్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల కమిటీ కార్యదర్శి కాద రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు, వివిధ సంఘాలతో పాటు ఆటో కార్మిక సంఘాలు ప్రతినిధులు ఎస్.ప్రసాదరావు, ఎస్.నాగరాజు, కె.రవికుమార్, ఎస్.రామినాయుడు, డి.పాపారావు, కె.అప్పన్న, పి.కూర్మారావు, ఎం.చిన్నారావు పాల్గొన్నారు.



పాలకొండలో ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం : ఢిల్లీలో రైతు ఉద్యమకారుడు శుబ్‌కరణ్ సింగ్ పై బిజెపి ప్రభుత్వం పాల్పడిన కర్కాశ ఉన్మాదపు దాడిని ఖండిస్తూ గుమ్మలక్ష్మీపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు మాట్లాడుతూ గత పోరాటంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోరాడుతున్న రైతులు పట్ల మోడీ ప్రభుత్వం దాడులకు పాల్పడడం విచారకరమన్నారు. రైతు ఉద్యమకారుడు శుబ్ కరణ్ సింగ్ ను మోడీ ప్రభుత్వం హత్య చేసే చర్యను ఖండిస్తున్నామని అన్నారు. రైతుల, ప్రజల, కార్మికులు కష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తులకు కొమ్ము కస్తూ దుర్మార్గపు పాలన సాగిస్తున్న బిజెపిని రానున్న ఎన్నికల్లో గద్దె దించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి మండింగి గోపాలరావు, మండల కార్యదర్శి పువ్వల ప్రసాదరావు, గిరిజన సమైక్య జిల్లా కన్వీనర్ లింగరాజు ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన పెండింగు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర సచివాలయం నుండి శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఓటర్ల జాబితాపై పత్రికల్లో వచ్చిన వార్తలపై తీసుకున్న చర్యలను ప్రశంసించారు. కలెక్టరు నిశాంత్ కుమార్ జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను గూర్చి వివరించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బంది నియామకం, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల అక్రమ రవాణా నియంత్రణ, పత్రికల్లో వచ్చిన వార్తలు, తదితర అంశాలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జెసి సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జి డిఆర్ఒ జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ డిఆర్‌ఒలు కె.హేమలత, వి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : డిఇఒ

ప్రజాశక్తి-పాలకొండ

మార్చి 18 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిఇఒ జి.పగడాలమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో పాల్గొనబోతున్న చీఫ్, డిఒల సమావేశంలో ఆమె పాల్గొంటూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి కావాల్సిన సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగానే పెద్దకాపు వీధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఆ పాఠశాలలో పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతున్న విధానం పరిశీలించి విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పెదకాపువీధిలో టెన్త్ విద్యార్థులను పరీక్షిస్తున్న డిఇఒ

కార్మికశాఖ అధికారికి వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

కార్మికునికి న్యాయం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం

18 ఏళ్లుగా సుదర్శన్ రెడీమేడ్ షాపులో పనిచేస్తున్న కార్మికుడ్ని విధుల్లో చేర్చుకొని న్యాయం చేయండని సహాయ కార్మిక కమిషనరు రాధాకృష్ణకు, కార్మికశాఖ అధికారి వెంకటేశ్వరరావు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, కార్మికుడు వి.విశ్వేశ్వరరావు శుక్రవారం వినతిని అందజేశారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ పట్టణంలోని సుదర్శన్ షాపీ బట్టల దుకాణంలో విశ్వేశ్వరరావు 18ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. మలేరియా జ్వరంతో పాటు ఫిట్స్ వచ్చి మూడు రోజులు సెలవు పెట్టిన కారణంగా షాపు యజమాని పనిలో పెట్టుకోవడం లేదని అన్నారు. ఈ పనినే ఆధారం చేసుకుని కుటుంబ పోషణ చేసుకున్న వ్యక్తికి పనిలేని కారణంగా వారి కుటుంబం ఇబ్బందులు పడుతుందన్నారు. కావున కార్మికుడికి న్యాయం చేయాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాము, షాప్ వర్కర్స్ యూనియన్ నాయకులు చొక్కాపు చంద్రమౌళి పాల్గొన్నారు.

కాంపాక్ట్ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ లో పారిశుద్ధ్య విభాగానికి చెందిన కాంపాక్ట్ వాహనాన్ని శుక్రవారం డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.42లక్షలతో కొనుగోలు చేసిన వాహనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, కమిషనర్ ప్రసన్న వాణి, డిఇ శ్రీరామ్మూర్తి ఎఇ సూరి, శానిటేషన్ ఇన్ స్పెక్టర్ ఫకీర్ రాజు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సల తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

శస్త్ర చికిత్సలు చేసుకున్న వారికి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వారానికి ఒకసారి కంటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించనున్నట్టు జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్య అధికారి జి.నగేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం గత వారంలో శస్త్ర చికిత్సలు చేసుకున్న 40 మందికి సామాజిక ఆరోగ్య కేంద్రంలో దృష్టి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. అనంతరం కంటిని ఎంత జాగ్రత్తగా కాపాడుకోవాలి, ఎటువంటి ఆహారాలు తీసుకోవాలి, ఏ ఆహారాలు తీసుకోకూడదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంటి వెలుగు సహాయకులు రోజా, మాలిక పాల్గొన్నారు.

గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్తు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

ఆదివాసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత విద్యుత్ సరఫరా పథకం లో భాగంగా, ఉచితంగా విద్యుత్ మీటర్లు, సర్వీసు వైరు, ఎల్ఇడి బల్బ్ అందజేస్తోందని ఎపిఇపిడిసిఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎవివి సూర్య ప్రతాప్ తెలిపారు. మండలంలోని దుడ్డుకల్లు పంచాయతీ కంబగూడ, లోవలక్ష్మీపురం, వనకాబడి పంచాయతీ కుస గ్రామాల్లో శుక్రవారం పర్యటించి విద్యుత్ సరఫరా కల్పిస్తున్న గృహాలను పరిశీలించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పిఎం జన్మన్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉచిత విద్యుత్ సౌకర్యం పొందాలని ఆదివాసీలను కోరారు.

రామినాయుడువలస పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

రామినాయుడువలస సమీపాన ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం రామినాయుడువలస గ్రామ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఏనుగుల గుంపు సంచారిస్తూ సమీప చెరుకు, అరటి తోటల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ ఇంతవరకు ప్రశాంతంగా ఉంటూ పంటలను సాగు చేసుకుంటున్న సమయంలో ఏనుగులు మళ్ళీ వచ్చి పంటల పొలాల్లో తిరుగుతూ నాశనం చేస్తున్నాయని అన్నారు. తామంతా రైతు కుటుంబాలమేనని, పంటలను సాగు చేసుకుంటూ నిత్యం పొలాల్లో ఉంటూ వ్యవసాయాన్ని నమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని అన్నారు. అటువంటిది ఏనుగులు ఏ క్షణాన ఏం చేస్తాయోనని భయభ్రాంతులకు గురౌతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. కావున సంబంధిత అటవీశాఖ అధికారులు స్పందించి తమ ప్రాంతం నుంచి ఏనుగులను దూర ప్రాంతాలకు తరలించి మా పంటలను, ప్రాణాలను కాపాడాలని కోరారు.

సమన్వయంతో పల్స్‌పోలియో విజయవంతం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మార్చి 3న నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని గరుగుబిల్లి, రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ సంతోష్ కుమార్ డాక్టర్ కె.కార్తీక్ అన్నారు. స్థానిక పిహెచ్‌సిలో శుక్రవారం పల్స్‌పోలియో కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. కావున ఆయా శాఖల అధికారుల సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేస్తున్నామన్నారు. లక్ష్యానికి మించి పల్స్ పోలియో చుక్కలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, వైద్య సిబ్బంది చింతాడ ఉదయకుమారి ,తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గల నేతాజీ గ్రంథాలయం వద్ద ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, స్నేహచైత్ర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు చేతుల మీదుగా నేతాజీ గ్రంథాలయం స్థాపకులు స్నేహచైత్ర ఫౌండేషన్ కార్యదర్శి ఈర్ల సంజీవ్ నాయుడు చలివేంద్రం శుక్రవారం ప్రారంభించారు. ఈ చలివేంద్రం వేసవి మూడునెలలు నిర్వహించడం జరుగుతుందని, గత 30 ఏళ్లుగా చలివేంద్రం ప్రతి ఏటా వేసవి 3నెలలు నిర్వహిస్తున్నానని తెలిపారు. వేసవిలో చలివేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని సంజీవనాయుడు తెలిపారు. కార్యక్రమంలో యువత గొర్రెల శ్రావణ్, కోట గౌరీనాథ్, వృక్షప్రేమికుడు దయానంద్, హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంజీవనాయుడు

ముందు కలవండి... ఆ తర్వాతే పిలవండి

టిడిపి -జనసేన విస్తృతస్థాయి సమావేశంలో జనసేన కార్యకర్తలు హుకుం
సమావేశానికి టిడిపి రెండో గ్రూపు డుమ్మా
జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిపై కార్యకర్తల తిరుగుబాటు

ప్రజాశక్తి - కురుపాం

టిడిపిలోని గ్రూపు రాకీయాల పట్ల జనసేన కార్యకర్తలు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. టిడిపి-జనసేన ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశం కురుపాంలోని సాయిరాం గుడి ఎదురు మైదానం వద్ద శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి, జనసేన ఇన్చార్జి కె.మల్లేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సమావేశం మధ్యలో జనసేన కార్యకర్తలు లేచి టిడిపిలోని రెండు గ్రూపులున్నాయని, ఈ సమావేశానికి ఒక గ్రూపు ఎందుకు డుమ్మా కొట్టిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో టిడిపి-జనసేన ఉమ్మడిగా అన్ని కార్యక్రమాలు చేయడానికి సిద్ధమవుతుంటే నియోజకవర్గంలో ఇందుకు విరుద్ధంగా ఏ కార్యక్రమం చేసినా జనసేన కార్యకర్తలకు కనీసం సమాచారం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మనం ఇక్కడ ఉమ్మడి అభ్యర్థి గెలిపించుకోవాలి అంటే అంతా ఏకతాటిపై ఉండి ఉమ్మడిగా ఉండాలి కానీ టిడిపిలో ఉన్న రెండు గ్రూపులు కలవకుండా ఏ కార్యక్రమం చేసినా జనసేనను పిలవడం లేదని అన్నారు. కనీసం జిల్లా, మండల స్థాయి పదవుల్లో ఉన్న జనసేన నాయకులకు కూడా కనీస సమాచారం ఇవ్వకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అనంతరం జనసేన ఇన్చార్జి కె.మల్లేష్ కార్యకర్తలతో మాట్లాడి సమన్వయ పరచడానికి చూడగా, ఆయనపై కార్యకర్తలు 'నువ్వు వెళ్తే ఒంటరిగా వెళ్లు, కానీ రెండు వర్గాలు కలిస్తేనే మేం పార్టీ కార్యక్రమంలో పాల్గొంటామని, అంతవరకు పార్టీ కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉంటామని జనసేన కార్యకర్తలు ఖరాఖండీ తేల్చి చెప్పారు. దీంతో రాబోయే రోజుల్లో కురుపాం నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు జనసేన, టిడిపి ఏమేరకు కలిసి పనిచేస్తాయో వేచి చూడాల్సిందే. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌చంద్రదేవ్, అరుకు పార్లమెంటరీ నియోజకవర్గ ఎస్టీ అధికార ప్రతినిధి ఎన్.కృష్ణబాబు, మండల కన్వీనర్లు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన ఇన్‌ఛార్జితో వాగ్వివాదం చేస్తున్న ఆ పార్టీ కార్యకర్తలు

హెల్త్ వాలంటీర్లను నియమించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఐటిడిఎ ద్వారా హెల్త్ వాలంటీర్లను నియమించి గిరిజన విద్యార్థులు ప్రాణాలు కాపాడాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో గిరిజన విద్యార్థులు మరణాలు అధికంగా జరుగుతున్నప్పటికీ గిరిజన సంక్షేమశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు తప్ప మరణాలు ఆగడానికి పరిష్కారం చూపే ప్రయత్నించకపోవడం చాలా దారుణమని అన్నారు. మొన్న కెడి కాలనీ ఆశ్రమ పాఠశాలలో ఒకరు. ఎపిఆర్ జూనియర్ కాలేజ్ భద్రగిరి మరొకరు, పిటిజి గుమ్మలక్ష్మీపురం, సరాయివలస,ఎర్రసామంత వలస విద్యార్థులు మతి చెందితే ఒక్కరి పైనే చర్యలు తీసుకోవడం మిగతా వారి పై చర్యలు తీసుకోకపోవడం ఆంతర్యం ఏమిటో అర్థం కావడంలేదని మన్యం జిల్లాలో వారం రోజుల్లో ముగ్గురు మతి చెందడం కలకలం రేపుతున్న దీనిపై ఉన్నతాధికారులు స్పందిచకపోవడం చాలా బాధాకరమని ఇప్పటికైనా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లు నియామకం చేపట్టకపోతే ఇలాంటి మరణాలు చాలా సంభవించే అవకాశం లేకపోలేదని, ఇకపై ఏ విద్యార్థికి ఏమైనా జరిగితే గిరిజన సంక్షేమ శాఖ అధికారులు బాధ్యత వహించాలని ఉంటుందని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం తరుపున హెచ్చరిక చేస్తున్నామని అన్నారు.

నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నర్సిపురంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

టిడ్కో గృహాల పరిశీలన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని అడ్డాపుశిలలో గల టిడ్కో ఇళ్ల సముదాయాన్ని రాష్ట్ర చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఇంజనీరింగ్ అధికారులు సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. అధికారిక పర్యటనలో భాగంగా స్థానిక మున్సిపాల్టీ పరిధిలో నిర్మాణంలో ఉన్న 768 ఎపిటిడ్కో గృహ సముదాయాల్లో జరుగుతున్న నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బందితో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి (హౌసింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్) పనుల పురోగతిని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి వారితో సంయుక్తంగా చర్చించడంతో పాటు, ఈ హౌసింగ్ ప్రాజెక్టులో ఉన్న గృహ సముదాయాలకు నిరంతర మంచి నీటి సరఫరా అందించే దిశగా సుమారుగా రూ.12 కోట్ల వ్యయంతో చేస్తున్న వాటర్ సప్లై పనులను పర్యవేక్షిస్తూ ఆయా పనుల సత్వర పూర్తి కోసం పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెలాఖరుకు అన్ని సదుపాయాలతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. మార్చి మొదటివారంలో ఇళ్లను అందజేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి, డిఇలు, సిఎల్‌టిసి, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ సముదాయాలను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రసన్నకుమార్

టిడిపి నాయకులు చేతకాని దద్దమ్మలు

వార్డు వాలంటీర్ల సన్మానసభలో రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ టిడిపి నాయకులు చేతకాని దద్దమ్మలు, వారు చేసిన అభివృద్ధిని చెప్పలేక తాను చేసిన అభివృద్ధి పనులు చూపించి సెల్ఫీలు తీసుకుంటున్నారు, వారికి సిగ్గులేదు' అని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో గల వార్డు వాలంటీర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న తహశీల్దార్ కార్యాలయానికి నూతన భవన నిర్మాణం కోసం తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేయించానని చెప్పారు. 2015 నవంబర్ 17న తహశీల్దార్ నూతన కార్యాలయం ప్రారంభమైందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో తాను మంజూరు చేయించిన నిధులతో భవన నిర్మాణం జరిగితే టిడిపి ప్రభుత్వం హయాంలో ప్రారంభించారని చెప్పారు. తాను మంజూరు చేయించిన నిధులతో నిర్మించిన తహశీల్దార్ కార్యాలయం భవనాన్ని టిడిపి ప్రభుత్వం హయాంలో నిర్మాణమైనట్లు టిడిపి నాయకులు సంధ్యారాణి, భంజ్‌దేవ్ ఫోజులిచ్చి సెల్ఫీ తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరేళ్ల ఎమ్మెల్సీగా వున్న సంధ్యారాణి నియోజకవర్గంలో చేసిన అభివద్ధి పనులు ఏమిటో చెప్పాలని సవాల్ చేశారు. టిడిపి హయాంలో నియోజకవర్గంలో చంద్రన్న బాట కింద కోట్లాది రూపాయల నిధులు మంజూరైతే పనులు జరుగకుండా మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి అడ్డుకున్నారని ఆరోపించారు. 2014నుంచి 2019 వరకు మంత్రిగా ఉన్న లోకేష్ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు మంజూరు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని మళ్లీ అధికారంలోకి తేవడానికి వాలంటీర్లే కీలక పాత్ర పోషించాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ, బి.శ్రినివాసరావు, బి.హైమవతి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వాణి పాల్గొన్నారు.

స్విఫ్ట్ చాట్ యాప్‌లో ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఉపాధ్యాయులంతా స్విఫ్ట్ చాట్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని విధిగా రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవాలని ఎంఇఒ-1 సామల సింహాచలం అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ, బ్లాక్‌బోర్డు స్థానంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పి)లను పాఠశాలల్లో ఏర్పాటు చేసి, ఆధునిక విద్యాబోధనను అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం, విద్యాబోధనలో ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉండేందుకు స్విఫ్ట్ చాట్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఉపాధ్యాయులు తమ చేతిలోని స్మార్ట్‌ఫోన్ ద్వారా ఎటువంటి ప్రశ్నకైనా సమాధానాన్ని కనుగొనే నూతన విధానంలో తాజాగా స్విఫ్ట్‌చాట్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. స్విఫ్ట్‌చాట్ యాప్‌లో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులు, భాషలకు సంబంధించిన పాఠ్యాంశాలను మొబైల్ యాప్‌లో పొందుపర్చారు. స్మార్ట్‌ఫోన్‌లో స్విఫ్ట్‌చాట్ యాప్‌ను కలిగి ఉన్న ఉపాధ్యాయులు తరగతిలో పాఠ్యాంశాలను బోధిస్తున్న సమయంలో విద్యార్థులు లేవనెత్తే సందేహాలకు స్విఫ్ట్‌చాట్ యాప్ లో సెర్చ్ చేసి తక్షణమే సమాధానాన్ని చెప్పే వీలుంటుందన్నారు. కావున స్విఫ్ట్ చాట్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు.

చందలంగిలో డ్రైడే, ఆరోగ్య సర్వే నిర్వహణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని మారుమూల గ్రామమైన చందలంగిలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్త, వ్యర్థ పదార్థాలను తొలగింపజేశారు. ఇళ్ల పరిసరాల్లో పాడైన, నిరుపయోగంగా ఉన్న వస్తువులను గుర్తించి, నీటి నిల్వలను పారబోయించారు. ఇళ్లల్లో దోమ తెరలు వినియోగిస్తున్న తీరును పరిశీలించారు. గ్రామస్తులకు ఆయన పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పిస్తూ దోమలు వృద్ధి చెందడానికి ప్రధాన కారణం నిల్వ ఉన్న నీరు అని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. ఎవరికైనా జ్వరాలు గానీ, ఇతర ఆరోగ్య పరమైన సమస్యలు ఉన్నాయా అని స్థానికులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలను గ్రామస్తులకు వివరించారు. నిర్ధారణ పరీక్షలు, మందులు గ్రామంలో అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గర్భిణీల గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య వివరాలు తనిఖీ వారి బరువు, ఎదుగుదల స్థితి పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేసి తగు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఎవరికైనా ఆరోగ్య సమస్యలున్నాయా అని తెలుసుకున్నారు. అనంతరం చినమరికిలోని వెల్నెస్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఎంతమంది ఆరోగ్య తనిఖీల కోసం అక్కడకు వస్తున్నారు, అందజేస్తున్న చికిత్స వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిహెచ్.ధనుంజయరావు, సూపర్‌వైజర్ సత్తిబాబు, స్థానిక పెద్దలు, వైద్య సిబ్బంది కృష్ణవేణి, నిహారిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధి హామీ పనులు జరిగే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపిడిఒ ఎస్.సాల్మన్‌రాజు క్షేత్ర సహాయకులకు సూచించారు. మండలంలోని రేగులపాడులో ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు కల్పిస్తే వేతనదారులకు కనీస వేతనం లభిస్తుందన్నారు. నిబంధన మేరకు పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. అనంతరం మస్తర్లను పరిశీలించారు.

సంఘీభావం తెలుపుతున్న టిడిపి నాయకులు

కలిసికట్టుగా పనిచేద్దాం : టిడిపి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పని కట్టుకొని పార్టీని, సిద్ధాంతాలను ఉద్దేశాలను నీరుగార్చేందుకు కొంత మంది చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ను గెలిపించుకుందామని నియోజకవర్గంలోని పార్వతీపురం రూరల్, అర్బన్, సీతానగరం, బలిజిపేట మండలాల అధ్యక్ష కార్యదర్శులు, పట్టణ పార్టీ అధ్యక్షులు పార్టీ పెద్దలు సంయుక్తంగా ప్రకటించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం కొంతమంది వ్యక్తులు పార్టీని దిగజార్చేలా పోస్టులు పెడుతున్నారని, దీన్ని ప్రజలంతా నమ్మి పార్టీ పట్ల తక్కువ భావం కలిగేలా ఉండాలన్న దురుద్దేశంతో ఆయా నాయకులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్వతీపురంలో ఏకైక నాయకత్వం నియోజకవర్గ ఇన్చార్జిగా బోనెల విజయచంద్ర నాయకత్వాన్ని సమిష్టిగా ముందుకు తీసుకోవాలని ఆయన నాయకత్వంతోనే పార్టీలో గెలుపు ఖాయమని పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని టౌన్ సిఐ జిడి బాబు కోరారు. పట్టణంలోని కోటవీధిలో ఉన్న దుకాణాల యజమానులకు ట్రాఫిక్ నియంత్రణపై శుక్రవారం అవగాహన కల్పించారు. దుకాణాలు, షాపులను రోడ్డుపైకి తేవొద్దని, వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చూసుకోవాలని సూచించారు. నిషేధిత మత్తు పదార్థాలను విక్రయించవద్దని హెచ్చరించారు. ఆయన వెంట ఎఎస్ఐ శ్రీనివాసరావు వున్నారు.

లంజ గ్రామానికి బస్సు సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కునేరు నుంచి మసిమండ మీదగా లంజ గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ రమేష్‌కు వినతిని అందజేశారు. అనంతరం సాంబమర్తి మాట్లాడుతూ మూడేళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు పండించిన పంటలను పార్వతీపురం, ఇతరత్రా ప్రాంతాలకు తరలించి గిట్టుబాటు ధరకు అమ్ములేక నష్టం జరుగుతుందన్నారు. విద్య, వైద్యం కూడా సకాలంలో అందని పరిస్థితి ఉందని, కావున వెంటనే బస్సు సౌకర్యం కల్పించి ఐదు పంచాయతీల గిరిజన గ్రామాల ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చిలకలపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చిలకలపల్లిలో బలిజిపేట పిహెచ్‌సి వైద్యాధికారుల పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జడ్పిటిసి అలజంగి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రజల వద్దకు ప్రభుత్వ వైద్యులను పంపిస్తూ వారి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఇంట్లో ఉంటూ తమ ఆరోగ్య సమస్యలను బయట పెట్టలేని ఎంతోమంది ఈ విధంగా దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర రోగాల నుండి ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యం కాపాడుకుంటున్నారన్నారు. ఈ మేరకు 352 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరికి ఐదుగురుకు జిల్లా హాస్పిటల్‌కు రిఫరల్ చేసినట్టు వైద్యాధికారి కిరణ్మయి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామ్మూర్తి, అపర్ణ బాల, వైస్‌ఎంపిపి వేలాది సాయిరాం, సిబ్బంది కర్ణ చంద్రావతి తదితరులు పాల్గొన్నారు

భామిని : గ్రామీణ ప్రాంతంలోని ప్రతి పంచాయతీలో అందరికీ పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కిశోర్, వైద్య అధికారి సంతోష లక్ష్మి తెలిపారు. ఈ శిబిరంలో 430 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశేశ్వరరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి అప్పారావు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారమే స్థల వ్యవహారం

సాలూరు :పట్టణంలోని వెంకటేశ్వరా డీలక్స్ స్థలం వివాదానికి సంబంధించి హైకోర్టులో కేసు, విచారణ, ఉత్తర్వులకు లోబడి గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్ అమలు ఉత్తర్వుల ప్రకారమే పని చేస్తున్నట్లు కమిషనర్ పి.ప్రసన్నవాణి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వ్యవహారంలో తనకు గాని, ఇతర సిబ్బందికి గాని ఎలాంటి ప్రమేయం లేదని చెప్పారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కురుపాం : వైడిఒ నెట్వర్క్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై కళా జాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక మెయిన్ రోడ్‌లో కళాజాత బృందం ప్రదర్శన నిర్వహించారు. వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకిన వారికి అందించే వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో వైడిఒ ప్రతినిధి గీతారాణి , సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వసూలు వేగవంతం

ప్రజాశక్తి - సీతానగరం

ఇంటి పన్నులు వేగవంతంగా వసూలు చేయాలని ఎంపిడిఒ కె.ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరపు ఇంటి పన్నులను నిర్దేశించే లక్ష్యాన్ని అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలన్నారు వెంటనే ఆన్లైన్లో పొందుపర్చాలన్నారు పంచాయతీ కార్యదర్శులు దృష్టిలో పెట్టుకొని తాగునీటికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, ఎఒ ఎంఎస్ఎన్ఎల్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

మూతబడ్డ ఎపిజివి బ్యాంకు

ఎపిజివిబిలు బంద్

ప్రజాశక్తి - భామిని

ఆలిండియా రూరల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ పలు డిమాండ్స్ అమలు చేయాలని ప్రతిపాదిస్తూ శుక్రవారం బ్యాంకు బంద్‌కు పిలుపునివ్వడంతో జిల్లాలోని రూరల్ బ్యాంకులైన ఎపిజివి బ్యాంకులు మూతడ్డాయి. గ్రామీణ బ్యాంకు బంద్‌పై ఖాతాదారులకు ముందస్తు సమాచారం లేకపోవడంతో ఖాతా దారులు వెనుదిరాగాల్సి వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, పార్వతీపురం మన్యం జిల్లా
నోటిఫికేషన్ నెం. 01/అవుట్ సోర్సింగ్ / 2024, తేది. 22.02.2024

పార్వతీపురం మన్యం జిల్లా రహదారులు భవనముల శాఖ వారి ఆధ్వర్యంలో ఉన్న ఇనస్పెక్షన్ బంగళాల యందు వాచ్‌మెన్, సానిటరీ వర్కర్లు, అటెండర్లుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. వివరములు మరియు దరఖాస్తు వెబ్‌సైటు https://parvathipurammanyam.ap.gov.in నందు పొందుపరచడమైనది. పూర్తి చేయబడిన దరఖాస్తులు **తేది. 23.02.2024 నుండి 28.02.2024వ తేది సాయంత్రం 5:00 గంటల**లోపు జిల్లా రహదారులు మరియు భవనముల ఇంజనీరింగ్ ఆఫీస్ (DREO), (ర & భ) సర్కిల్, కలెక్టర్ ఆఫీసు కాంపౌండ్, బెలగాం, పార్వతీపురం నందు సమర్పించవలెను.

దరఖాస్తు స్వీకరణకు చివరి తేది మరియు సమయం తేది. 28.02.2024 సాయంత్రం గం. 5.00 ని. వరకు

జిల్లా కలెక్టరు మరియు మేజిస్ట్రేటు,
పార్వతీపురం మన్యం జిల్లా